# డెన్టిస్ట్

అదొక మామూలు శనివారం సాయంత్రం. కథా సమయానికి శ్రీమతి రాధాకృష్ణ రాత్రి వంటతో కుస్తీ పడుతోంది.

శ్రీమతి రాధాకృష్ణ అంటే శ్రీ రాధాకృష్ణ భార్య అనేకదా అర్థం. సొంతపేరుకు తిలోదకలాచ్చిన వ్యక్తి కాదు ఆమె. స్వాభిమానం కొంచెం ఎక్కువగానే ఉండి నలభయ్యేళ్ళ వయస్సున్నట్లు కనిపించే ముప్పయి తొమ్మిదేళ్ళ ఆవిడ ఆ శ్రీమతి రాధాకృష్ణ. చీపురు పల్లి వాస్తవ్యురాలయిన ఆ శ్రీమతి రాధకు ప్రాణనాధుడయినవాడు మిలటరీలో కవాతుచేసే ఫిరంగిపురం వాస్తవ్యుడయిన మేజర్ కృష్ణ.

అయితే, ఈ నాయికా నాయకులు కమ్మవారా, రెడ్డివారా లేక కాపువారా అని ఎవరయినా ప్రశ్నిస్తే దానికి ఈ కథలో ప్రసక్తి లేదు. చిన్న చిన్న కథల్లో కూడా పాముపడగలాంటి కులతత్త్వాన్ని ప్రవేశపెడితే ఎన్నో గందరగోళాలకు, పోట్లాటలకు, హత్యలకు, ఆత్మహత్యలకు, ఆత్మాహుతులకు మనం నైతిక బాధ్యత వహించవలసి వస్తుంది. ప్రస్తుతం మనం కులం, మతం అనే విశ్లేషణకు అతీతంగా వెళ్ళి రాధాకృష్ణులను పరిశీలిద్దాం.

వాళ్ళ 'మధువిధు' (హనీమూన్) జరిగి పదహారేళ్ళు గడిచినందువల్ల కాలహరణం చెందిందని దాన్ని పురావస్తువుగా మనం వదిలేద్దాం. మిలట్రీలో ఉండేటప్పుడు కేప్టెన్ కృష్ణ సొంత భార్య అయిన రాధను 'ఆన్‌డ్యూటీ' మీద భారతదేశంలో వివిధ భాగాలకు వెంటతీసుకొని వెళ్ళాడు. నలభై రెండేళ్ళ వయస్సులో మేజర్‌గా రిటైరయిన కృష్ణ. ఇప్పుడు కలకత్తాలో ఒక మేజర్ ప్రైవేట్ కంపెనీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

అయితే, మిలట్రీ జీవితం నుంచి సివిలియన్ జీవితానికి వచ్చేటప్పుడు గొప్ప అభిమానంతో తనతో తెచ్చుకున్నవి రెండు. తన పురుషత్వానికి బాహ్యలక్షణమైన గుబురు మీసం ఒకటి. ఎలాంటి మీసానికయినా ఎప్పటికీ అర్హత పొందలేని ఇరువురు కుమార్తెలు రెండోది. పెద్దమ్మాయి కిప్పుడు పధ్నాలుగు, రెండో అమ్మాయికి పన్రెండు. అంటే రాధాకృష్ణులు దాదాపు పదిహేను నెలలపాటు నిర్విఘ్నంగా, సుఖంగా, 'మధువిధు' అనుభవించారని మనం ఊహాపోహ చేస్తే అందులో పెద్ద తప్పేం లేదు.

ఆ పెద్ద మీసమున్న ఆయన ఒక చిన్న తగాదాకు కూడ వెళ్ళలేని శాంతస్వభావి. ఒక పొట్టి నిక్కరు, ఒక టీషర్టు వేసుకొని మంచి చురుకయిన యువకుని మాదిరి తెల్లవారుఝామున 'జాగింగ్' అనే కార్యక్రమానికి వెళ్తుంటాడు. కానీ ఆయన శ్రీమతి మాత్రం గడియారంలో చిన్నముల్లు పెద్దముల్లు నిటారుగా నిలబడడానికి

ముందు మాత్రం ఆమెకు లేవడం సాధ్యం కాదు. అంటే ఆమె ఆడ కుంభకర్ణ అని అనుకోకూడదు. రాత్రిపూట కావాలంటే రెండుగంటల వరకయినా మేల్కొనే ఉంటుంది. రాత్రి విందు భోజనాలలో పాల్గొనడం రాధ, కృష్ణ లిరువురికీ మహా ఇష్టం. అయితే, అలాంటి విందుభోజనాలు తమ ఇంటిలో అయితే తక్కువగానే ఉండాలనే ఒక నియమం పెట్టుకున్నారు. ఎందుకంటే ఈకాలంలో ఖర్చు తక్కువగా చేయడం చాలా అవసరం కదా!

శ్రీమతి రాధకు తన రూప లావణ్యాల గురించీ, తన భర్త శక్తి సామర్థ్యాల గురించి గొప్ప అభిప్రాయముంది. ఆమె భర్త ఉగ్ర - మీసాలమీద ఆమెకున్న అభిమానం చూడాలంటే మీసాల్లేని మగవాళ్ళు ఎక్కువగా ఉన్న విందుకు వెళ్ళాలి. అక్కడ ఆ మీసాల్లేని మగవాళ్ళు, వారి ధర్మదారలు ఒక ఎలుగుబంటిని చూస్తున్న కళ్ళతో మీసాలంకృతమైన ఈ శ్రీకృష్ణుడి వదన వీక్షణం చేసేటప్పుడు శ్రీమతి రాధాకృష్ణ కళ్ళు వికసించి, చెంపలు కాంతివంతమై ఆమె అధరాగ్రాన ఒక చిరునవ్వు దాగుడు మూతలాడడం గణనార్హమయిన కొన్ని ప్రత్యేకతలు. తన భర్తకు యువకత్వం ఉంది, మంచి ఆరోగ్యముంది. ఎవర్నయినా ఎదిరించడానికి కావలసిన శక్తి ఉంది అని ఆ శ్రీమతి నమ్మకం. ఆయన ప్రతిరోజూ షటిల్ ఆడతాడు. ఆ ఆటలో ఆయనకు మంచి ప్రావీణ్యం ఉందని చూచేవాళ్ళు కూడ ఒప్పుకుంటారు. కానీ ఆయన శ్రీమతి అనుకున్నట్లు ఆయన మీసాలకు తగిన శౌర్యంగాని, కోపంగాని ఆయనకు లేదని మాత్రం కాదు. షటిల్ కాక్‌ను ఆయన బాట్‌తో గట్టిగా కొట్టడం తప్ప ఇంతవరకు ఏ మనిషినయినా కొట్టడంగాని, తన్నడంగాని, తిట్టడంగాని చూచే అదృష్టం ప్రజలకెవ రికీ కలగలేదు. ఆయన బాల్యదశలో ఆయన ఒక కుక్కపిల్ల మీదనయినా రాయిని విసరలేదని కావాలంటే ఆయన చిన్ననాటి స్నేహితులు ప్రమాణం చేస్తారు. ఇవన్నీ, సత్యాలయినా కూడా ఆ శ్రీమతికి ఆమె భర్త ఒక 'బ్లడ్ హౌండ్ ' కుక్కలా భయంకరుడని అభిప్రాయ ప్రకటన చేయడమే ఆమెకిష్టం.

ఈ వివరణలన్నింటిలో పడి అసలు ఆ శనివారం సాయంత్రం ఏం జరిగిందన్న విషయం మర్చిపోయాం. అది సాయంత్రం కాదు సంధ్యకూడ దాటిపోయినట్లు చెప్పాలి. ఎందుకంటే సమయం ఏడున్నర అయింది. పిల్లలిద్దరూ వాళ్ళ గదిలో కూర్చుని చదువుకుంటున్నారు. కృష్ణ అప్పుడే షటిల్ బాడ్మింటన్ ఆట ఆడి వచ్చి విస్తారమైన స్నానకృత్యంలో నిమగ్నుడై ఉన్నాడు. ఫోన్ రింగవడం విని శ్రీమతి రాధాకృష్ణ వంట గదినుంచి పరుగెత్తుకు వచ్చి రిసీవర్ చేతిలోకి తీసుకుంది.

''మిసెస్ రాధాకృష్ణ హియర్'' అని గంభీరంగా మామూలుగానే చెప్పింది.

''రాధా డార్లింగ్! అయ్ లవ్‌యు'' అని ఒక యువకుడి గొంతు. అది ఒక పెద్ద పురుషుడి గొంతుకాదు.

''అలాగని వెళ్ళి నీ అమ్మతో చెప్పరా వెధవా!'' అని ఆమె అరిచింది.

''అమ్మతో ఎప్పుడూ చెప్తుంటానక్కా! ఆమెకలా నేను చెప్పడం చాలా ఇష్టం కూడా. మరి మీకు మాత్రం ఎందుకింత ఉడుకు వస్తోంది?''

''ధైర్యముంటే నాముందుకు రారా! ఇలా ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడడమేనా నీ మగతనం?''

''దేనికయినా నాకు ధైర్యముందక్కా! రేపు ఆదివారం కదా! ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కు రావచ్చా!''

''రా! రా! నీ పళ్లేమన్నా మిగిలితేకదా నువ్వు బ్రేక్ ఫాస్ట్ తినేది?''

''ఏమిటీ? మీరొక డెన్టిస్టా!''

''అది నువ్విక్కడకు వస్తే తెలుస్తుంది. నీలాంటి వెధవలకు ఒకసారి మిలిట్రీ దెబ్బ, తగిలితేగాని బుద్ధిరాదు. ధైర్యముంటే వచ్చేసేయ్.''

''తప్పకుండా రేపుదయం వస్తాను. అంతవరకు మీ ఉద్రేకాన్ని ఆపి పెట్టండి... గుడ్ నైట్... స్వీట్ డ్రీమ్స్...''

పది నిమిషాల్లోపల మళ్ళీ ఇంకో ఫోన్ కాల్. ముందు పిలిచిన వాడే గొంతు మార్చి మాట్లాడుతున్నాడా అని ఆమెకు అనుమానం వచ్చింది. సంభాషణ దాదాపూ అలాంటిదే. కానీ అది కొంచెం హ్రస్వమైన ఎన్‌కౌంటర్. అలాంటివే తరవాత పది నిమిషాల్లో మరిరెండు కాల్స్ వచ్చాయి శ్రీమతి రాధకు.

ఆమెకు ఆ టెలిఫోన్‌నే బద్దలు కొట్టాలనిపించింది. స్నానానంతరం హుషారుగా ఈల వేసుకుంటూ వస్తున్న కృష్ణకు ఎదురుగా కనిపించింది రాధ కాదు సాక్షాత్ భద్రకాళి. పూనకం వచ్చినట్లు ఊగిపోతూ ఆమె జరిగిందంతా చెప్పింది. రాధా తాండవం చూచి భయపడిన కృష్ణ ఆమె కోపోపశమనానికి ప్రయత్నించాడు.

''నీ ధోరణి చూస్తే నేనే ఆ పిల్లలకు ఫోన్ చెయ్యమని చెప్పినట్లుంది. అల్లరి పిల్లలు ప్రతిచోటా ఉంటారు. వాళ్ళు ఏదయినా ఒక నంబర్ డయల్ చేసి ఇలాగే మాట్లాడతారు. దాన్ని నువ్వింత సీరియస్‌గా ఎందుకు తీసుకోవాలి? రాంగ్ నంబర్ అని చెప్పి రిసీవర్ పెట్టేస్తే పోయేది కదా!''

రాధకు కోపం మరీ ఎక్కువయింది.

''అయితే ఏ వెధవైనా నాతో ఏం మాట్లాడినా మీకేం అనిపించదా?''

''నువ్వే అనుకుని వాళ్ళు ఫోన్ చేశారనా నీ అభిప్రాయం? ఊరికే ఫోన్ తిప్పేటప్పుడు ఒక ఆడది లైనులోకి వస్తే వాళ్ళు కొంచెం తమాషాగా మాట్లాడతారు. అంతే...''

''అయితే మనం తెలుగు వాళ్ళమని వాళ్ళకెట్లా తెలుసు?''

''దానికేం కష్టం రాధా! డైరెక్టరీ చూస్తే చాలుకద!''

''అలాగయితే డైరెక్టరీలో మన అడ్రసుకూడా దొరికితుందే... వాళ్ళు రేపు ఉదయం ఇక్కడకు వచ్చేస్తేనో?''

''ఛ! ఛ! అంత ధైర్యం వాళ్ళకుండదు... నువ్వేం కంగారు పడొద్దు. రేపుదయం నేను బైటికెళ్ళనులే. కానీ... ఇంకెప్పుడైనా ఇలాంటి కాల్స్ వస్తే నువ్వు కోపం తెచ్చుకోకుండ చాలా 'కూల్'గా మాట్లాడాలి.

ఇటు నుంచి మనం గెంతడం మొదలు పెడితే అవతల వాడికి తమాషాగా ఉంటుంది. మనకు జ్వరం రాలేదనుకో వాడికి 'ఉస్' అని గాలిపోయినట్లుంటుంది. తరవాత ఈ నంబరుకు వాళ్ళెప్పుడూ ఫోన్ చెయ్యరు''.

ఆరాత్రి రాధకు నిద్ర రాలేదనడం ఆమెకు రాని నిద్ర అంత వాస్తవం. మేజర్ కృష్ణ నిద్రపోయాడుగాని నిద్రవచ్చే వరకు తన భార్య వివేక శూన్యత, దాన్ని గురించి గట్టిగా ఆమెకు చెప్పలేకపోవడం; ఒకవేళ ఆ తలతిక్కగాళ్ళు ఉదయమే వచ్చేస్తారమో నన్న విదూర సంభావ్యతలను గురించి ఆలోచించి ఒక కంటక శయ్యమీద పడుకు న్నట్టు పడుకున్నాడు.

ఆ ఆదివారం అనుకున్నదానికంటె ముందే వచ్చేసింది. ఉదయం అయిదు గంటలకే మామూలుగా లేచిన కృష్ణ వికసిత నేత్రాలతో పైన ఉన్న సీలింగ్ ఫాన్‌ను చూస్తూ పడుకున్న రాధను చూడగలిగాడంటే ఆమె అలవాటుకు విరుద్ధంగా తొందరగా లేచి ఆ ఆదివారం ఉదయంకోసం వేచి ఉందన్నమాట. అందువల్లనే కాబోలు తూర్పు దిగంతం నుంచి ప్రభాకరుడు కూడా తలెత్తి చూడడానికి ప్రయత్ని స్తున్నాడు. ఏమయినా, అంత పొద్దునే శ్రీమతి ఉత్కంఠతకు ఉత్తేజం కలిగించడం ఇష్టంలేక ఆమె లేచిన విషయాన్ని తాను గుర్తించనట్లు నడిచి ఆ దొంగకృష్ణ జాగింగ్‌కు వెళ్ళాడు.

పిల్లలతో కలిసి రాధా, కృష్ణలు ఇరువురూ బ్రేక్‌ఫాస్ట్ చేశారు. రాధ ముఖంలో వివర్ణత ఎక్కువవుతున్నట్లు అతనికి అనుమానం వచ్చిందిగానీ ముందురాత్రి విషయం మళ్లీ ఆ సుప్రభాతంలో ఎత్తడం అనవసరమని ఊరుకున్నాడు. వంట వగైరాలు పూర్తిచేసుకుని దూరదర్శన్ వాళ్ళ రవివారం కార్యక్రమాలను వీక్షించడానికి మామూ లుగా తన రాధ వచ్చేస్తూ ఉంటుందని కృష్ణ అనుకున్నాడు. చాలాసేపు ఆమె రానందువల్ల ఆయనే స్వయంగా వంటగదికి వెళ్ళి చూస్తే గిన్నెల్ని తోముకుంటూ, కడిగిన గిన్నెల్ని నెమ్మదిగా తుడుచుకుంటూ ఏదో ఆలోచనలో పడిపోయినట్లు కనిపించింది. అవన్నీ తరవాత చేసుకోవచ్చు కదా! టీవీ కార్యక్రమాలు ఎందుకు వేస్ట్

చేయాలి అని అన్నాకూడా ఆమెనుంచి వచ్చిన ఒకే ఒక ప్రతిక్రియ 'వచ్చేస్తా' అన్న యాంత్రిక అధర చలనం మాత్రమే. కృష్ణ మళ్ళీ దూరదర్శన్‌ను సమీపదర్శనం చేయడం మొదలుపెట్టాడు.

సమయం పదీ-పది అయింది. డోర్ బెల్ శబ్దం విని ఆదివారం మామూలుగా కొంచెం ఆలస్యంగా, పదీ, పదిన్నర గంటలకు తీరిగ్గా వచ్చే పనిమనిషి అనుకొని రాధ వెళ్ళి తలుపు తీసింది.

''హలో అక్కా!'' అంటూ ఉల్లాస పూర్వకంగా అభివాదనం చేస్తూ నలుగురు యువకులు లోపలికి దూసుకొని వచ్చారు. వాళ్ళల్లో నేతలాంటి వాడొకడు ''అక్కా! మిమ్మల్ని చూస్తే మాకు ఎంతో సంతోషంగా ఉంది కానీ మాకు భలే ఆకలిగా ఉంది. అందువల్ల బ్రేక్‌ఫాస్ట్‌కు ఏమేమి ఉందో అదంతా టేబుల్ మీద పెట్టండి'' అని చెప్పాడు.

బైట ఏదో హడావుడిగా ఉంటే కృష్ణ టి.వి రూమ్ నుంచి బైటికి వచ్చాడు. ఎవరు వచ్చారో అని చూడడానికి ఇద్దరు అమ్మాయిలు కూడా బైటికి వచ్చారు. వచ్చిన వాళ్ళు అపరిచితులవడం వల్ల కృష్ణ వాళ్ళను లోపలికి వెళ్ళమని చెప్పి రాధ దగ్గరకు కంగారుగా వచ్చాడు.

''మీరెవరు? మీకేం కావాలి?'' అని ఆత్రంగా వాళ్ళని కృష్ణ అడిగాడు.

''ఆహా! బాగుందే! అక్కా! బావతో ఇంతవరకు ఈ విషయం చెప్పలేదా? అక్క ఆహ్వానం మన్నించే కదా మేమింత ఉదయం పరుగెత్తుకొని వచ్చింది?'' అని ఆ పోకిరి పిల్లల నేత చిరంజీవిలాంటి పూర్ణ వికసిత నేత్రాలతో, రాజబాబులాంటి దీర్ఘవక్ర శైలితో అడుగుతుంటే మిగిలిన ముగ్గురు పరమానందయ్య శిష్యులకున్న అమాయకత్వంతో, ఆశ్చర్యభావంతో నవ్వారు.

''మిమ్మల్నెవర్నీ నేను పిలవలేదు. మర్యాదగా బైటకి పోకపోతే నేను పోలీసుల్ని పిలిపిస్తాను'' అని రాధ కొంచెం కోపంగా అంది.

''అక్కా! ఊరికే ఉడుక్కుంటావెందుక? మీకు పోలీసులకు ఫోన్ చేయాలని అంతగా ఉంటే ఎక్కడికయినా పక్క ఇంటికి పోవాల్సిందే. ఎందుకంటే అక్కగాని, బావగాని ఈ ఇంట్లో ఫోన్ మీద చెయ్యి బెడితే మాత్రం దాని వైర్ తెగిపోతుంది. అనవసరంగా అదనపు ఖర్చు ఎందుకు తెచ్చుకుంటారు?''

''అనవసరంగా కలహమెందుకు? మీలో ఎవరూ మాకు తెలియదు. చూస్తే మీరు మంచి పిల్లల్లానే ఉన్నారు. దయచేసి మీరు వెళ్ళిపొండి. నా భార్య మాటలు మీకు నచ్చకపోతే 'అయాం సారీ ఫరిట్'. కానీ అనవసరంగా మీరే కదా ఆమెకు ఫోన్ చేసి గొడవ చేసింది?'' అని పాలల్లా పాలిపోయిన గోపాలకృష్ణ అన్నాడు.

''నా బంగారు బావా! ఎవర్నీ చంపడానికీ, కొట్టడానికీ మేం రాలేదు. ఇక్కడకు రావడానికి మాకు ధైర్యముందా? అని సవాల్ చేయడంవల్ల మేము రాకపోతే చేతులకు గాజులు తొడుక్కోవాల్సి వస్తుంది కదా! అందుకే ధైర్యంగా ఇక్కడికి వచ్చి మీ ఇద్దరి దర్శనం చేసుకుని పోదామనుకున్నాం'' అని అర్థ పరిహాస ధోరణిలో ఆనేత చెబుతుంటే కృష్ణ గుండె దడ కొంచెం తగ్గింది.

''దర్శనమయి పోయిందికదా ఇంక దయచేయండి'' అని కొంచెం పరుష స్వరంలో రాధ అంది.

''ఇదేం మర్యాదండీ! ఇంటికి వచ్చిన వాళ్ళను కూర్చోమని చెప్పే అతి సామాన్య మర్యాదకూడ మీకు లేదే? చూడగానే గెటౌట్ అనడానికి మేము అనాహూతులం కాము. రారా! వాళ్ళు అనకపోయినా మనం కూర్చోకుండ ఎలా పోతాం? అంటూ తలతిక్క బాగా ఎక్కిన ఆ నేత తలతిక్క అప్పుడే పుడుతున్న మిగిలిన ముగ్గురితో అంటూ వారితో లోపలికి వెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లో నాలుగు కుర్చీలలో కూర్చున్నారు.

''మీరిద్దరు కూడా కూర్చోండి... ఏంటి? చెప్తుంటే వినిపించడం లేదా?'' అన్న ఆ నేత స్వరంలోని ఆ ధృడమైన ఆజ్ఞా భావాన్ని అర్థం చేసుకొని కృష్ణ ఒక స్ప్రింగ్‌లాగా గెంతి ఒక కుర్చీలో కూర్చున్నాడు. ఆయన ధృతచలనాన్ని గమనించిన శ్రీమతి కూడ ఆయన్ని దాదాపు అనుకరించింది.

నేత తన మాటల్ని సాగించాడు.

''ఇంక అసలు విషయానికి వద్దాం. మేం ఇంటిలో కాలు పెడితే మా పళ్ళు మిగలవని అక్క మాతో ఫోన్‌లో చెప్పింది. మీలో ఎవరండీ డెంటిస్ట్? బావగారి మీసాలు చూచి మేం భయపడిపోతామని అనుకున్నారా అక్కా! పోలీసు అన్నా, మిలిటరీ అన్నా మాకేం భయం లేదు. ఏం బావా! మా పళ్ళు తీసేసే ధైర్యం మీకుందా?''

''నాకు ఎవరి పళ్ళనీ ఊడగొట్టే ఉద్దేశం లేదు. నా భార్య మీకెవరికీ ఫోన్ చేసి బెదిరించలేదు. మీరే మరీ మరీ ఫోన్ చేసి సతాయించడం వల్లనే ఆమెకు కోపం వచ్చింది'' అని కోపలేశం కూడా వ్యక్తంకాకుండా పాపం ఆ భర్త అతి శాంత స్వరంతో అన్నాడు.

''ఏమయినా మేమింకా చిన్న వాళ్ళం. పళ్ళూడిపోయే వయస్సింకా రాలేదు. మీ ఇద్దరకూ పళ్ళు కదలుతున్నాయో లేదో చూడడానికి ప్రధానంగా మేం ఇక్కడికి వచ్చాం. ఈయన పేరు గోపాల కృష్ణయ్య. డెంటిస్ట్ కాకపోయినా ఐటిఐలో ఫిట్టర్ కోర్సు ఈయన పాసయ్యాడు. అందువల్ల పళ్ళు ఊడదీసే పని ఈయనకంత సమస్య కాదు. ఓరే! బావగారి నోరు తెరచి చూడరా!''

బాగ్ నుంచి ఒక ప్లయర్ బైటికి తీసి ఆ గోపాలకృష్ణయ్య దగ్గరకు రావడం చూచి విభ్రాంతి పొందిన కృష్ణ కుర్చీనుంచి చటుక్కున లేచాడు. రాధ పెద్దగా ఏడవాలా వద్దా అన్న సందిగ్ధావస్థలో ఉంది.

''ఛీ! ఛీ! మిలటరీ వాళ్ళిలా భయపడితే ఈదేశం గతి ఏమయి పోతుంది? ఇతను మీ నోరు తెరచి చూడబోతున్నాడు అంతే! దానికి నొప్పి ఏమయినా ఉంటుందా? అక్కా! మీరు కూడ ఎలాంటి గొడవా చేయకూడదు. అనవసరంగా మీ పిల్లలు కూడా భయపడిపోతారు. మీరిద్దరూ మర్యాదగా కూర్చోండి. అరచి, గగ్గోలు పెట్టాలని ఉంటే మేం బలప్రయోగం చేయకతప్పదు.''

ఆ నేత, గోపాలకృష్ణయ్య కలిసి పాపం ఆ మిలిటరీ వాణ్ణి బలవంతంగా కుర్చీలో కూర్చోబెట్టారు. మిగిలిన ఇద్దరూ రాధ దగ్గరకువెళ్ళి నిలబడడంతో భయపడి రెండు చేతులతో ముఖం కప్పుకుని ఊపిరి బిగబట్టి కూర్చుంది.

''బావా! నోరు తెరువు'' అని గోపాలకృష్ణయ్య అనగానే కృష్ణ ఒక చిన్న బిడ్డ మాదిరి నోటిని పూర్తిగా తెరిచి చూపించాడు. రెండు వైపుల నుంచి ఆ నాయకుడు గోపాలకృష్ణ తెరిచిన ఆ నోట్లోకి చూచారు.

''ఒరేయ్! ఈ బావగారికి ముందు రెండు పళ్ళు ఊడిపోయినయ్. మిగిలిన వన్నీ బాగానే ఉన్నట్టున్నాయి కదా!'' అనే నాయకుడి అభిప్రాయంతో పెద్ద అట్టహాసం చేస్తూ ఏకీభవించాడు గోపాలకృష్ణయ్య.

''ఇప్పుడిక అక్కని పరీక్షిద్దాం'' అని చెప్తూ ఆ నాయకుడు రాధ దగ్గరికి వెళ్ళాడు.

''ప్లీజ్, ప్లీజ్... ఆమెను సతాయించ వద్దు... నేను చెప్పేది కొంచెం వినండి మీరు...'' అని కృష్ణ అతిదీనంగా కోరాడు.

''బావగారూ! మీ పళ్ళేమైనా తీశామా? అక్క మీద మీకు పెద్ద కంట్రోల్ ఏమీ లేదని మాకు తెలుసు... అయినా ఆమె పెద్దనోరు చూడందే మేం వెళ్ళం... రౌడీ తనం చేయడం మాకు తెలియదని కాదు. మీకు అది తప్పకుండా చూడాలని ఉంటే చూపించడం తప్పదు. ఓయ్! పిన్నమ్మా! కొంచెం నోరు తెరువు... ఏంటి? 'పిన్నమ్మా' అని పిలవడం నచ్చలేదా?

మా అమ్మకంటె ఒక అయిదారేళ్ళు తక్కువేమో... మీ వయస్సులో మాకు ఒక అక్క ఉండడానికి వీల్లేదు. అందుకే మిమ్మల్ని ఇంక 'పిన్నమ్మా' అనే పిలుస్తాం... ఊ! నోరు తెరవండి! ఒరే గోపాలా! సరిగా చూడు.'' వాళ్ళు చెప్పినట్టు వినకపోతే పరిస్థితి విషయమిస్తుందని తెలుసుకున్న రాధ నోరు కొంచెం తెరిచి చూపించింది.

''పిన్నమ్మా! ఇంత మాత్రమే తెరిస్తే మీ నాలుకమీద ఉన్న పాచి మాత్రమే కనిపిస్తుంది. మేం చూడాలనేది మీ పళ్ళనే. బావ తెరిచినట్లు నోరు పెద్దగా తెరవండి. లేకపోతే పట్టకారు పెట్టి తెరవాల్సి వస్తుంది.''

భయంతో వణుకుతున్న కృష్ణ వాళ్ళని ఆపాలని వాళ్ళ భుజంమీద చెయ్యి పెట్టబోవడం; అంతలోనే అవ్యక్తంగా ఏదో మంత్రోచ్చారణ చేయడం; ఏ దేవుణ్ణి ముందు స్మరించాలో తెలియక అర్థడజను పేర్లు చెప్పడం వంటివి చేస్తున్నాడు.

అప్పటికే రాధ నోరు పెద్దగా తెరిచేసింది.

''రాజేంద్రా! ఇదేంటి? ఈమె నోట్లో పళ్ళే లేవురా! నవ్వడానికి మాత్రం కావలసిన ముందు పళ్ళున్నాయి... అంతే! మనకంటె ముందే ఎవడో హాల్‌సేల్‌గా తీసేశాడురా! ఫ్రంటులో ఉన్న పదహారులో పదిహేనే మిగిలి ఉన్నాయి. వాటినలాగే ఉండనిద్దాం.'' అంటూ తన ముప్పయిరెండు పళ్ళూ బైటికి కనిపించేలా గోపాలకృష్ణయ్య నవ్వాడు.

నవ్వు ఆపుకోలేక రాజేంద్రుడనే ఆ నాయకుడు ''ఇప్పుడు గదా... అసలు గుట్టు బయట పడింది?

నమలడానికి పనికివచ్చే పక్క పళ్ళు ఈ పిన్నమ్మకి బైబై చెప్పి కొంతకాలమయినట్టుంది. అందుకే ఆమెకంటే చిన్నవాళ్ళ పళ్లు ఊడగొట్టాలని ఆమెకి ఆశ. అదేం జరిగే పనికాదు పిన్నమ్మా!... బావా! మీకేం ఇబ్బంది కలిగించకుండా వెళ్ళిపోతున్నాం... కానీ... మీ ముక్కుకింద ఇంత పెద్ద మీసం ఉన్నప్పుడు మీలో కొద్దిగ మగతనం ఉండాలి కదా! ఈమె డ్రస్సు విషయంలో కొంచెం జోక్యం చేసుకోకూడదా! ఇటు చూడండి... ఇటు చూడండి... ఈ బ్లౌసుకు ఇంత లోకట్ అవసరమా? ఇదంతా ఎవరికి చూపించడానికి? మళ్ళీ వెనక అయితే మొత్తం ఓపెనే... ఇదంతా చూస్తే బావకు ఏదయినా ఉత్తేజం కలుగుతుందా? ఎప్పుడో కొన్ని సంవత్సరాల ముందయితే కలిగితే కలిగి ఉండవచ్చు. ప్రస్తుతం ఈ పిన్నమ్మ ఇంతగా ప్రదర్శించడం మాలాంటి కుర్రవాళ్లకోసమే... అది చూచాక మాకు కొంచెం ఉత్తేజం కలిగి ఫోన్ ద్వారా ఏదో కొంచెం శృంగారం ఒలకబోస్తే దానికి తప్పేముంది? అవకాశం దొరికితే మాకంటె చెడ్డవాళ్ళయిన పిల్లలు ఇంకా ఏమయినా చెయ్యవచ్చు. అందుకే పిన్నమ్మా! ముందు నీ యిల్లు సర్దుకో. తరువాతనే వేరే వాళ్ళకు పాఠం చెప్పు. అయితే బావా! మేం వెళ్ళివస్తాం. మళ్ళీ ఎప్పుడో... ఎక్కడో... ఎలాగో కలుస్తాం... బై... బై''

ఆ నలుగురు యువకులు కృష్ణ చెయ్యి పట్టుకుని హస్త చాలనం చేసి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

తలుపులు మూసేసి డ్రాయింగ్ రూమ్‌కు తిరిగి వచ్చిన కృష్ణ రెండు మూడు నిముషాలపాటు భార్య ముఖంవైపు ఉగ్ర వీక్షణం సారించాడు. తరవాత వేగంగా పడక గదిలోకి వెళ్ళి పడుకున్నాడు.

ఆ ఉగ్ర వీక్షణానికి ఏమామూలు స్త్రీ అయినా భస్మమై పోయేదే కానీ ఆ సాధు కృష్ణుడి రాధకు ఏమయిందో మాకు తెలియదు.